క్లుప్తంగా

విద్యార్థులకు స్పెల్ విజార్డ్ పోటీలు

మణుగూరురూరల్: పట్టణంలోని మణుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్, ఎస్ఈఆర్టీ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో మండల స్థాయి స్టోరీ టెల్లింగ్ అండ్ స్పెల్ విజార్డ్ పోటీలను శనివారం నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొని ఆంగ్లంలో కథలు చెప్పడంతో పాటు పలువురు స్పెల్ విజార్డ్ రాశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఆంగ్ల నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎల్టీఏ మండల కన్వీనర్లు షేక్ మీరాహుస్సేన్, టి.వెంకన్న, ఆంగ్ల ఉపాధ్యాయులు ఇంద్రసేనారెడ్డి, పార్వతి, గంగా, జ్యోతి, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

మూడు పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణాన్ని మూడు పంచాయతీలుగా విభజిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నం.45 ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని జీఎస్పీ కన్వీనర్ సొందే వీరయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని సుందరయ్య నగర్‌లో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాల ప్రకారం ప్రభుత్వం వెంటనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు. ఈ మేరకు ఈ నెల 8న అఖిలపక్ష గిరిజన సంఘాల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో యాలం బుచ్చిరాజు, నర్సింహారావు, రాధ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు చేయకపోతే రాస్తారోకో చేస్తాం

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం గ్రామంలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు లేక రైతులు నెలల తరబడి పడిగాపులు కాస్తున్నారని, ధాన్యం కొనుగోలు చేయకపోతే మండల కేంద్రంలో రైతులతో కలిసి రాస్తారోకో చేస్తామని టీఏజీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలమంచి వంశీ హెచ్చరించారు. శనివారం మారాయిగూడెం గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ రైతులతో కలిసి జీసీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధర్నా నిర్వహించారు. అనంతరం టీఏజీఎస్ మండల కార్యదర్శి, స్థానిక సర్పంచ్ తోడం తిరుపతిరావు మాట్లాడారు. నాయకులు అపక శ్రీను, రైతులు సొందే అర్జున్, సున్నం వెంకటేశ్వర్లు, సోడి వెంకటేష్, అపక గాంధీ, సొందే జోగయ్య, కారం వెంకటేశ్వర్లు, జోగయ్య, గోపాలరావు, సురేష్ పాల్గొన్నారు.

జీపుజాతా..

ములకలపల్లి: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణా రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఆధ్వర్యంలో మండల పరిధిలోని కమలాపురంలో శనివారం జీపుజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా చట్టాన్ని, నూతన పెన్షన్ స్కీంను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శులు మురళీమోహన్, శ్రీనివాస్, కిషోర్, అశోక్, హనుమంతరావు, కృష్ణారావు, మండల అధ్యక్షుడు వీరేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీని బాధ్యుడిగా చేయడం సరికాదు

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ.20 లక్షలు నిధుల దుర్వినియోగంపై అమాయకుడైన ఆదివాసీ ఉద్యోగి సీఈఓ రామారావును బాధ్యుడిని చేయడం సరికాదని పీసా కమిటీ మండల అధ్యక్షుడు చాప ముత్తయ్య, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు తంగెళ్ల భద్రయ్య అన్నారు. శనివారం అశ్వాపురంలో వారు విలేకరులతో మాట్లాడారు. అక్రమాలకు సీఈఓ సహకరించడం లేదని ఆయననే బాధ్యుడిగా చూపుతున్నారన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

ములకలపల్లి: పెయింటింగ్ పనులు చేస్తూ ప్రమాదానికిగురైన భగత్‌సింగ్‌నగర్ గ్రామస్తుడు తాళ్ల శ్రీనివాస్ కుటుంబీకులకు బీఆర్ఎస్ నాయకులు రూ.లక్ష విలువైన ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చొరవతో మంజూరైన ఈ ఎల్‌ఓసీ పత్రాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మోరంపూడి అప్పారావు, శనగపాటి అంజన్‌రావు బాధిత కుటుంబానికి అందజేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

బలోపేతం చేయాలి

అశ్వారావుపేటరూరల్: గ్రామ స్థాయి నుంచి బీజేపీ బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఏంతైనా ఉందని అశ్వారావుపేట అసెంబ్లీ పాలక్ అమర్ సింగ్ పవార్ అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో శనివారం పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమ్మేళన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడారు. నాయకులు దొంగల సత్యనారాయణ, బి.ప్రసాద్, ఐదు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఆశా'ల సేవలు అమోఘం

- గర్భిణులు, బాలింతలకు అవగాహన
- సాధారణ ప్రసవాల్లో కీలక పాత్ర
- తల్లీబిడ్డల సంరక్షణ కోసం అహర్నిశలు కృషి

SUNDAY SPECIAL


ఇంటింటి సర్వే చేస్తున్న ఆశాలు (ఫైల్)


నెలవారి పరీక్షల కోసం 102 వాహనంలో గర్భిణులను తీసుకొచ్చిన ఆశా కార్యకర్తలు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసుకుని, ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సమాచారమందించే ఆరోగ్య వారధులు ఆశ కార్యకర్తలు. గర్భిణులకు మందులు అందించడం, ప్రభుత్వ దవఖానల్లో ప్రసవం అయ్యేలా చూడడం, పిల్లలకు టీకాలు వేయించడం తద్వారా మాతా శిశు మరణాలు తగ్గించడం వీరి ప్రధాన విధులు. కరోనా వంటి ప్రాణాంతక వ్యాధుల గుర్తింపులోనూ వీరు అందించిన సేవలు అమోఘం.

ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఆశవర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. అంతే కాకుండా వారు విధులు నిర్వహిస్తున్న ప్రదేశంలో 18 సంవత్సరాలు నిండి, వివాహం జరిగిన వెంటనే ఆ గ్రామ అంగన్‌వాడీ కేంద్రాల్లో వివాహం నమోదు తేదీని ధ్రువీకరించేలా చర్యలు చేపడతారు. మహిళలు గర్భం దాల్చినట్టు అనుమానం వచ్చిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి పరీక్ష చేయించి గర్భిణిగా ధ్రువీకరిస్తారు. వెంటనే 12 వారాలకు చెందిన ఎంసీపీ కార్డు అందజేసి గర్భిణిగా నమోదు చేస్తారు. అనంతరం టీటీ ఇంజక్షన్ ఇప్పించి, అదే రోజున కేసీఆర్ కిట్ కోసం ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేయిస్తారు. మొదటి నెల నుంచే ప్రాథ మిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి రక్తం, యూరిన్, థైరాయిడ్ పరీక్షలు చేయించి, కాల్షియం, ఐరన్ మాత్రలను అందజేస్తారు. మొదటి నెల నుంచి తొమ్మిది నెలల వరకు చుక్కలతో కూడిన బొమ్మను నింపేలా కార్డును గర్భిణికి అందజేసి, నిత్యం మాత్రలను వేసుకుంటూ, చుక్కలను కలపాలని అవగాహన కల్పిస్తారు. దీంతో తల్లి కడుపులో బిడ్డ ఎదుగుల కనబడేలా చివరి వరకు బొమ్మ తయారు అవు తుంది. ఇక మూడో నెల నుంచి గర్భిణి ఇంటికి ప్రతి రోజూ వెళ్లి సుఖ ప్రసవం జరిగేందుకు దోహదపడే సూచనలు, యోగా ఆసనాలు, చిట్కాలను వివరిస్తారు. మూడో నెలలోనే కేసీఆర్ కిట్‌లో భాగంగా రూ.3వేల నగదును గర్భిణి బ్యాంక్ అకౌంట్లో జమ చేయిస్తారు. గర్భం దాల్చిన మొదటి నుంచే అంగన్‌వాడీలో పేరు నమోదు చేయిస్తారు. ప్రతి రోజూ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తినేలా కృషిచేస్తారు. 7, 8, 9 నెలల్లో గర్భిణులను 102 అమ్మ ఒడి ప్రభుత్వ వాహనంలో స్థానికంగా ఉన్న భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లి గైనకాలజిస్టును కలిసి దగ్గరుండి పరీక్షలు చేయిస్తారు. ఇటీవల స్థానిక ఏరియా ఆసుపత్రి టిఫా స్కానింగ్ మొదలు కాగా ఈ పరీక్షలు కూడా చేయించి, తల్లీబిడ్డల ఆరోగ్య పరిస్థితిని వైద్యుల ద్వారా తెలియజేస్తారు. 9 నెలలు నిండగా (ఎల్ఎంపీఈడీ) పుస్తకంలో ఎంట్రీ చేయిస్తారు. తొమ్మిదో నెల మొదటి వారంలోనే గర్భిణి డెలివరీ తేదీని వారి కుటుంబీకులకు వివరిస్తారు. అక్కడి నుంచి ప్రతి రోజూ గర్భిణిని ఇంటి మనిషిగా నిత్యం ఆరోగ్య పరిస్థితిని తెలుసు కుంటున్నారు. నొప్పులు వచ్చిన వెంటనే 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రి కు తీసుకెళ్తారు. అంతే కాకుండా ఆసుపత్రికి తీసుకెళ్లిన తరువాత గర్భిణి డెలివరీ అయ్యాక బీపీ, హెచ్చు తగ్గులను పరిశీలించి, పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రు పాలు పట్టిస్తారు. అక్కడే ఉండి తల్లీబిడ్డల సంరక్షణ చర్యల్లో భాగంగా పుట్టిన బిడ్డ కలర్, బాలింతకు బ్లడ్ బ్లీడింగ్ వంటి కార్యక్రమాలను చేపడతారు. డెలివరీ అయిన తల్లులను మూడు రోజులకు అమ్మఒడి వాహనంలో క్షేమంగా ఇంటికి చేర్చేలా చర్యలు తీసుకుంటారు. డెలివరీ అయిన మహిళను 3, 4, 7, 14, 21, 28, 42 రోజుల్లో వారి ఇంటికి వెళ్లి తల్లీబిడ్డల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటారు. పుట్టిన బిడ్డకు 16 నెలల వయసు వచ్చాక (డీపీటీ) బూస్టర్ ఇంజక్షన్ తోపాటు చుక్కల మందును వేస్తారు. బిడ్డకు ధనుర్వాతం, మెదడు వాపు, తెల్లమచ్చలు వంటివి రాకుండా నివారణ చర్యలు చేపడతారు. బిడ్డ సంరక్షణలో భాగంగా చిన్నప్పటి హెపటైటిస్ (బీ) చుక్కల మందును కామెర్ల వ్యాధి నివారణ కోసం వేయిస్తారు. ఓపీవీ, ఐపీవీ వేయించి ఓరల్, వాయిల్ పోలియో నివారణ చర్యలు వివరిస్తారు.

పథకాలను ప్రజలకు చేరవేస్తున్నాం..



రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నాం. గర్భిణుల గుర్తింపు, ఆరోగ్యంపై అవగాహన, తల్లిబిడ్డల యోగక్షేమాలపై పర్యవేక్షణ చేస్తున్నాం. ప్రజలకు సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నాం.

– విజయలక్ష్మి, ఆశ కార్యకర్త, భద్రాచలం

ప్రభుత్వం కనికరం చూపాలి..



నిరంతరం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే ఆశాలపై పనిభారం పడుతోంది. ప్రభుత్వ సర్వేలతో పాటు వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో విజయవంతంగా విధులను నిర్వహిస్తున్నాం. మా సేవలను ప్రభుత్వం గుర్తించాలి. ఉద్యోగ భద్రత కల్పించి మమ్మల్ని ఆదుకోవాలి.

– సుజాత, ఆశ కార్యకర్త, భద్రాచలం

చట్టాలను ఉల్లంఘిస్తే శిక్షలు


బూర్గంపాడు: న్యాయసదస్సులో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ నీలిమ

బూర్గంపాడు: చట్టాలను ఉల్లంఘిస్తే ఎంతటి వారికైనా శిక్షలు తప్పవని భద్రాచలం జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నీలిమ అన్నారు. సారపాక గ్రామపంచాయతీలోని చంద్రయ్యగుంపులో శనివారం న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ నీలిమ మాట్లాడుతూ.. గిరిజనులు ఏజెన్సీ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోడుభూములు, అటవీచట్టాలను సద్వినియోగం చేసుకుని గిరిజనులు వృద్ధిలోకి రావాలన్నారు. మోసపోయిన, లైంగికదాడులకు గురైన గిరిజనులకు ఉచితంగా న్యాయమందించేందుకు న్యాయ సాధికారత సంస్థ పనిచేస్తుందన్నారు. గిరిజనులు కూడా సంఘ వ్యతిరేక శక్తులకు దూరంగా ఉండాలని, వారి కదలికలపై స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. న్యాయసదస్సులో తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎస్సై సంతోష్, ఎంపీడీఓ వివేక్‌రామ్, ఏపీపీ దుర్గాబాయి, న్యాయవాదులు ముత్యాల కిషోర్, దాట్ల సంధ్య, రమాదేవి, జగదీష్, నరేందర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

మణుగూరురూరల్: ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కమలాపురం గ్రామంలో మండల లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ చైతన్య సదస్సుకు మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోర్ట్ ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చన్నారు. ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయశాఖ కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే లోక్ అదాలత్‌ను నిర్వహిస్తూ కేసులను పరిష్కరిస్తోందన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి రాజీమార్గమే రాజ్యమార్గమని అన్నారు. ఫిబ్రవరి 11న జరిగే లోక్ అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్, పెండింగ్ కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామ్మోహన్‌రావు, భాస్కర్‌రావు, సాంబశివరావు, సూర్యం, మధుసూధన్‌రావు, ఎస్సై రాజ్‌కుమార్, కోర్ట్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కోర్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపంథా నాయకులపై తహసీల్దార్ ఫిర్యాదు

చర్ల: సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు దురుసుగా మాట్లాడారని చర్ల తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. చర్ల మండలంలోని లింగాపురం, కొత్తపల్లి గ్రామాల సమీపంలోని గోదావరి నది నుంచి శనివారం మధ్యాహ్నం ట్రాక్టర్ల ద్వారా కొందరు వ్యక్తులు ఇసుకను తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఇసుక ట్రాక్టర్లను గ్రామస్తులతో కలిసి సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ నాయకుడు కొండా చరణ్ అడ్డుకున్నారు. దీనిపై తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణలో చరణ్ అసభ్య పదజాలంతో దురుసుగా మాట్లాడాడంటూ తహసీల్దార్ భరణిబాబు కొండా చరణ్‌తో పాటు పాముల సాంబ, శివప్రసాద్, ఎర్రావుల ఎల్లయ్య, కొంగూరి శోభన్, సాగర్, నాని విశారదలపై శనివారం రాత్రి చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. చర్లలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి సంబంధించి ఇసుక తోలకానికి అనుమతినిచ్చామని, తామే అనుమతి ఇచ్చామని చెప్పినప్పటికీ వినిపించుకోకుండా ఇష్టానుసారంగా మాట్లాడారని తహసీల్దార్ తెలిపారు. కోర్టు అనుమతి మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ అశోక్ తెలిపారు.

అభివృద్ధికి కృషి చేయాలి

భద్రాచలం: నూతనంగా నియమించబడిన మైనార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. భద్రాచల మైనార్టీ సెల్ మహిళా అధ్యక్షురాలిగా వసిమా, సెక్రటరీగా హసీనా, మండల అధ్యక్షుడిగా మహబూబ్ ఆలీలను జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ ఖాన్ నియమించారు. వీరికి శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో పొదెం వీరయ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. జిల్లాలోని మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వారికి నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సరేళ్ల నరేష్, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతిరేల రవికుమార్, కాంగ్రెస్ నాయకులు బలుసు నాగ సతీష్, సరేళ్ల వెంకటేష్, మహిళా కాంగ్రెస్ నాయకులు పందాల సరిత, కుమారి పాల్గొన్నారు.

అధికారులకు అభినందనలు


భద్రాచలంటౌన్: తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్‌కు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

భద్రాచలంటౌన్: భద్రాచలం మండల తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్‌కు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రశంసపత్రం అందజేశారు. భద్రాచలం పట్టణంలో రాష్ట్రపతి పర్యటన, ముక్కోటి ఉత్సవాలను విజయవంతం చేయడంలో విశేష కృషి చేసిన అధికారులతో కొత్తగూడెంలో శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ ప్రశంసా పత్రం అందుకున్నారు.

దుమ్ముగూడెం: రాష్ట్రపతి పర్యటన, ముక్కోటి ఉత్సవాలను విజయవంతం చేయడంపై మండలంలోని తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ ముత్యాలరావులు కలెక్టర్ ఎస్పీల నుంచి ప్రశంసలు అందుకున్నారు.

బూర్గంపాడు: బూర్గంపాడు మండలం నుంచి తహసీల్దార్ భగవాన్‌రెడ్డిని కలెక్టర్, ఎస్పీ అభినందించారు. ప్రశంసాపత్రాన్ని అందించారు.

వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ అసెంబ్లీ పాలక్ సీతయ్య

చర్ల: రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని భారతీయ జనతా పార్టీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ పాలక్ యాపా సీతయ్య పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో నియోజకవర్గ కన్వీనర్ శ్రీనాథరావు అధ్యక్షతన జరిగిన బూత్ కమిటీల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని, పదవులతో పని లేకుండా ప్రతీ కార్యకర్త పార్టీ కోసం సమయం కేటాయించాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యావతి మాట్లాడుతూ.. పోడు భూములను సాగు చేసుకుంటున్న నిరుపేద ఆదివాసీల పట్ల ఈ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ బిట్రగుంట క్రాంతి కుమార్, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సతీష‌కుమార్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి కోటీశ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రంరాజు, ఉపాధ్యక్షుడు సీతారమరాజు, కార్యదర్శులు నిడదవోలు నాగబాబు, జాడి లక్ష్మి, కార్యవర్గ సభ్యులు సంతపురి సురేష్‌కుమార్, గూనూరి రమణ, రామళ్ల రాజశేఖర్, మండల అధ్యక్షుడు నక్కా కన్నయ్య, ప్రధాన కార్యదర్శి పుగాకు పూర్ణచంద్, నాయకులు లోకనాథం, గంగరాజు, అనీల్, నాగేంద్రయ్య, తరుణ్‌రెడ్డి, యాకూబ్, హుస్సేనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం నిర్వహణపై ఫిర్యాదు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, రైతులు

దుమ్ముగూడెం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పట్టడంలో జాప్యం జరుగుతోందని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ జేసీ వెంకటేశ్వరరావుకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం మండలంలోని చిన్నబండిరేవు గ్రామంలో జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొన్ని రోజులుగా అధికారులు ధాన్యంలో మచ్చవస్తుందని మిల్లర్లు దిగుమతి చేసుకోవటం లేదని అంటూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ విషయమై స్థానిక రైతులు జెడ్పీటీసీ దృష్టికి తీసుకురాగా ఆమె గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. జీసీసీ అధికారులు అదే సమాధానం ఇవ్వడంతో ఆమె సమస్యను జేసీ వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకునివెళ్లారు. దీనిపై స్పందించిన జేసీ ఈ విషయం నిన్న కలెక్టర్ దృష్టికి వచ్చినట్లు, మిల్లర్లతోటి మాట్లాడి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు తునికి కామేష్, నాయకులు కొమ్ము రంజిత్, స్థానిక రైతులు పిట్టా శ్రీనివాసరావు, మాదురి సూరిబాబు, మందా హరిబాబు, గొనె ఉపేంద్ర, మందా నాగేశ్వరరావు, బొడ్డు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. శనివారం స్థానిక క్యాంప్ కార్యాలయం, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో బీఆర్ఎస్ పార్టీ కల్చరల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేసీఆర్ కప్ నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలను ఎమ్మెల్యే రేగా కాంతారావు–సుధారాణి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత వారు రేగా విష్ణుమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ.. ప్రతీ ఏటా కేసీఆర్ కప్ క్రీడాపోటీలను కనీ వినీ ఎరుగని రీతిలో వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఈ దఫా వాలీబాల్, షటిల్, క్యారమ్స్, రన్నింగ్ వంటి అనేక క్రీడాపోటీలను వారం రోజుల పాటు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చే క్రీడాకారులకు వసతి, ఉచిత భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ రూ.30వేలు, తృతీయ రూ.20వేలు, నాలుగో బహుమతి రూ.5వేలు అందజేయనున్నామన్నారు. వాలీబాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ప్రతీ ఒక్కరికి రేగా విష్ణు ట్రస్ట్ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్లను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, నియోజకవర్గంలోని అన్ని మండలాల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

అన్నపురెడ్డిపల్లి: మండలంలో పేకాట, కోడిపందేలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై విజయ హెచ్చరించారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాలపడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు తారసడిన వివరాలను 9440904244 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. పోలీసులకు సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ తెలంగాణ క్యాలెండర్లను శనివారం భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కుర్సం రామారావు, జిల్లా అధ్యక్షుడు జయబాబు, రవిబాబు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, నాగబాబు, వరలక్ష్మి, రాణి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ పంచాయతీలో ఆయుర్వేద వైద్యాధికారి జి.అరుణ ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ జి.అరుణ, డాక్టర్ ఎం.ఉమాదేవి వైద్య పరీక్షలు నిర్వహించారు. 152 మంది రోగులను పరీక్షించి ఆయుర్వేద మందులు అందజేశారు. ఆయుష్ ఆరోగ్య కరదీపికను అందించారు. మొండికుంట గ్రామ పంచాయతీ కార్యదర్శి సైదులు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శకుంతల, ఏఎన్ఎం లలితకుమారి ఆశాలు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర నేతకు పలువురి పరామర్శ

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామానికి చెందిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య చారి సతీమణి అనసూర్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, వైస్ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి షాబీర్‌పాషా ఆమె పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలతో నివాళ్లు అర్పించారు. అయోధ్యను పరామర్శించారు.

శ్రీనివాసాచారిని సన్మానించిన మంత్రి


శ్రీనివాసాచారిని సన్మానిస్తున్న మంత్రి హరీష్‌రావు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన పదిరావూరి శ్రీనివాసాచారి వాస్తుశాస్త్రంలో థాయిలాండ్ దేశంలో అక్కడి గవర్నర్ చేతుల మీదుగా ఇటీవల అమెరికన్ యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ తీసుకున్నారు. శ్రీనివాసాచారి శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి హరీష్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. డాక్టరేట్ తీసుకున్న సందర్భంగా శ్రీనివాసాచారిని మంత్రి హరీష్‌రావు శాలువాతో సన్మానించారు.

కనుల పండువగా పునర్వసు కల్యాణం

దుమ్ముగూడెం: పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరాముడి జన్మ నక్షత్రం సందర్భంగా నిర్వహించే పునర్వసు కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శేషం కిరణ్ కుమారాచార్యులు, ప్రతాపురం భార్గవాచార్యులు కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం పుర వీధుల గుండా స్వామి వారికి ఊరేగింపు చేపట్టారు. మరోవైపు పర్ణశాల దేవాలయంలో వైకుంఠ అధ్యయనోత్సవ ముగియగా.. ధనుర్మాస వ్రత మహోత్సవాలు కొనసాగుతాయి. అవి ఈ నెల 14వ తేదీన ముగియనుండగా.. 11న స్వామి వారికి కూడారై మహోత్సవ కార్యక్రమం, 14న ఉదయం పద్మావతి గోదా కల్యాణం ఉంటుంది. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ నిరంజన్, ఆలయ ఇన్‌చార్జ్ చంటి, సిబ్బంది కన్నయ్య, శివ, రాము పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

డ్రెయినేజీతో దుర్గంధం



మండల కేంద్రమైన దమ్మపేట గ్రామంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న డ్రెయినేజీ, మురుగు నీరుతో నిండుకుండను తలపిస్తోంది. దమ్మపేట గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో రోడ్డు పక్కనే ఉన్న ఈ డ్రెయినేజీ పూర్తిగా మురుగు నీటితో నిండిపోయి, నాచు పైకి తేలుతూ కనిపిస్తోంది. ఇక్కడి నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామని పరిసర ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని డ్రెయినేజీని శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

- దమ్మపేట

ప్రశ్నించాల్సిన అధికారి: పసుపులేటి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి, దమ్మపేట
ఫోన్ నంబర్: 9908188125